# పాదరక్ష ఉపన్యాసము

శ్రీ వార్తకవి కృష్ణమూర్తి

ఆవేళ ఆదివారం - అమావాస్యరోజు. మా నాన్నగారు వాటిని కొనడం ఆసాయంకాలం నాలుగున్నరఘంటల ముహూర్తాన. వాటికిగాను ఆ బజారులో మేము వెదకని కొట్టు లేదు. రెండుమూడంగుళముల దళసరితో, నిగనిగలాడే గాజుపెంకులతో పొదుగబడి, కిర్రుబుర్రుమంటూ, మా నాన్నగారి కైతో మురువుగా మెరువుగా వున్నాయి ఆ చెప్పులజోళ్లు. ఆ రాత్రి ఎత్తి ఘంటలకు దాసుగారి హరికథకు వెళ్లాం. వసారాలో జోళ్లు వదలి లోనికెళ్లి కూర్చున్నాం. ౯ శ్రీ ఘంటలకు కథ ముగిసింది. తర్వాత బయటికి వచ్చి చూచుసరికి మా నాన్నగారి క్రొత్తజోడు కనపడలేదు. వసారా అంతటినీ, గూళ్లలోను బొరియలలో సహా వెతికాం. ఎక్కడగాని కనిపించాయిగావు. ఏ ముష్టివెధవచేతుల్లోనో పడ్డాయని తెలుసుకొన్నాం. పాపం! మా నాన్నగారి ఆవేదన ఇంతా అంతా గాదు. ఎంతో వెదకి వెదకి భ్రమపడి కొన్నజోళ్లు ఒక్కక్షణంలో అమాంతంగా అలా మాయమైనందుకు వారికడుపు భగ్గుమని మండింది. దానితో, ఆచెప్పులదొంగకెన్నో శాపాలు చదివేశారు. "నీ కెక్కడ మతిపోయిందిరా అబ్బాయి? అమావాస్య - ఆదివారం, రత్తిఘంటల రాహుకాలం అనేసంగతి జ్ఞాపకం చేశావుగావు. ఎంతో ఇంగ్లీషు చదివేవు. ఇంకా ఎన్నో చదివి ఏడుస్తా నంటావు." అంటూ నాకుగూడా రెండుచీవాట్లు పెట్టారు. ఇలా గొణుగుతూ సణుగుతూ మా నాన్నగారు, నేనూ ఇల్లు చేరాం. అప్పటికప్పుడే ౧౧ ఘంట లవడంచేత, గదిలో కెళ్లి పడుకున్నాం. మా నాన్నగారికి కలిగిన దుస్థితికి చింతిల్లుతూ పోయినజోళ్లని పదేపదే తలచుకోవడంమూలాన్ని నాకు త్వరలో నిద్దుర పట్టిందిగాదు. తర్వాతెప్పుడు కళ్లు మూశానో తెలీదు. ఆ తర్వాత జరిగిన వింతకథ ఇది.

హఠాత్తుగా ఎటునుంచో రెండు పాత చెప్పులు నడచుకుంటూ వచ్చి, నాగది ప్రవేశించాయి. వాటి నక్కడక్కడ ఎలుకలు ఫలహారం చేసినట్లుంది. ఎడమకాలిచెప్పుకు ఉంగటమూడింది. కుడికాలిచెప్పుకు కుట్లూడినాయి. ఒకదానికి చెదపట్టింది, మరొకదానికి ఎలికపెంటిక లంటుకున్నాయి ఒకటి మడిగింది, మరొకటి ఉడిగింది. ఎంతో వికారంగా అసహ్యంగా వున్నాయి. అందం తరిగి, అంగాంగము లుడిగి, జరాభారంతో కృశించే దిక్కులేని వృద్ధునిపోలిక తోపజేస్తాయి. ఒక భావకవి అయ్యుంటే, వాటిపై అప్పుడే ఒక భావగీత మల్లి పారవేసేవాడు. ఇంతలో నా జోళ్లక్కడగల కుర్చీమీదకి, టకీమని ఎగిరినాయి. ఒకచెప్పు కూర్చొని అధ్యక్షత వహించింది. మరొకటి పైకి లేచి నిలుచుండి ఇలా ఉపన్యాస మారంభించింది. అచేతనము లెలా మాట్లాడగలవని ఆశ్చర్యపడుతూన్నా.

"మిత్రమా! అచేతనములెలా మాట్లాడ గలుగుతున్నా యని ఆశ్చర్యపడుతూన్నావు గాబోలు. ఈ ఆధునిక వైజ్ఞానికయుగాన ఇది చిత్రమైన విషయం గాదు. అసంభవమూ గాదు. అచేతనములు చేతనములైనాయి. అచరములు చరములైనాయి. లేనివో విమానా లెలా తిరుగుతున్నాయి? రైళ్లెలా సంచారము చేయ గలిగాయి? ఊపిరిలేని వస్తువులు మాట్లాడ్డం మీకిప్పుడు క్రొత్తవింతా? ఎక్కడచూచినా యంత్రాలు, చెవులు చిల్లులుపడేలాగు గింగురుమంటూ బొబ్బ లెట్టడము లేదూ? హోరుమంటూ గాలి వీచడము లేదూ? సముద్రఘోష మీరు వినడంలేదూ? కావున ప్రస్తుతము నేను మాట్లాడడం సందేహించకుండా నిజమని నమ్ముతా రని నామనవి.

విషయాని కుపక్రమించే టందుకు ముమ్మొందుగా, మీనాన్నగారి కీవేళ గలిగిన దుస్థితికి, మా సంతాపం దెలుపుకుంటాం. చూశారా! ఈ చెప్పులదొంగల చేతుల్లో పడి, మే మెంత హీనస్థితిలో చిక్కి కృశిస్తూన్నామో! చూపఱ కేవగింపు గలిగించెడి వికారాకారాలతో మీ యెదుట గోచరిస్తున్నామో! ఎంత దక్కుమాలిన దీనస్థితికి చిక్కి, మా విషాదచరిత్రల మీకు వినిపించి, మీ దయార్ద్రవచనముల మా దుఃఖాన్ని దిగమ్రింగుకుంటున్నామో మీకు తెలుస్తూంది గదా. ఎప్పుడీ నిర్భాగ్యపు దామోదరులకు—ఈ—చెప్పులదొంగలకు, తగిన శిక్ష లభిస్తుందో ఎదురుచూస్తున్నాం. మీకెందు కింత కోప మంటారా? ఒకమాటు మా జీవితచరిత్ర విన్నారంటే ఆవిషయం మీకు బోధపడుతుంది. ఈసృష్టిలో ప్రతి వస్తువుకు, చేతనమైనా, అచేతనమైనా ఒక చరిత్ర వుంటుంది. మీ జీవితం మాదిరిగా, దానికిగూడా కాల మెన్నో మార్పులు తెచ్చి పెట్టుట గలదు. దానికిగూడా శైశవము, బాల్యము, యౌవనము, కౌమారము, వృద్ధాప్యము సహజములే. దాని జీవితానుభవాలు సహాసీతిమిళితములే అల్పవస్తువు లని మమ్ము నిరసనభావంతో చూడకండి. మానవుని గానమంగూడా అల్పంతో ఆరంభమైంది. దైవదృష్టిలో పిపీలికాది బ్రహ్మపర్యంతము ఒకటే. స్థూలంలో వుండే దేవుడు సూక్ష్మంలోగూడా వున్నాడు కంకణగాథ మీకు క్రొత్తది గాదు. గడ్డిపోచచరిత్ర మీ కెరిగినదే. కావున ఈ సృష్టిలోని ప్రతివస్తువును, అల్పమైతేనేం స్వల్పమైతేనేం, తృణీకరించకుండా మాచరిత్రలుగూడా విని మమ్ముం నాదరించాలని వేడుకుంటూన్నా.

మీ రెన్నో ఆత్మకథలు విని యుందురు. మహానుభావుల స్వీయచరిత్ర లెన్నో పఠించి యుంటారు. ఆదర్శప్రాయుల ఆత్మకథలు మీకు తెలిసేయుండును. కాని నాలో అంత మహత్తు లేదు. శాస్త్రజ్ఞానం సున్న. వేద వాసన నసలే లేదు. ఒకసుగుణ మేమంటే, నేను మీ కెంతో ఉపయోగకారినైన వస్తువు. "పరోపకారార్థం ఇదం శరీరం" అన్నట్లు నా యావజ్జీవపర్యంతము మీ పాదసేవ చేస్తుంటా. రాజు మొదలు బంటువరకూ నన్ను నాజాతివారిని గౌరవింతురు. రాజాధిరాజైనను మమ్ముల తనకాళ్ల నిడుకొని మోయవలసిందే. లేనిచో ఏ పామో, పురుగో పుట్రో, రాయో రప్పో మిమ్ముల బాధించ గలవు. మరిన్ని మందు వేసంగిలో మేము మీ కత్యంత అవసరము. లేకున్న మీరు

బయ టడుగు పెట్టగలరా? అడుగు పెట్టినచో
కాళ్లు బొబ్బలుపారి తెయితెక్క లాడెదరు.
మాకుగూడా పౌరుషము, ప్రతాపము, అధి
కారము, ఉన్నతులు వున్నాయి. దెబ్బతిన్న
మనుజుని కులాని కెలేయుదురు. కత్తిపోటుకు
గూడా అంత మర్యాద లేదు. తప్పుగూడా
లేదు. చెప్పుదెబ్బంటే చాలు జను లదరి
పడి చత్తురు. మాలోగూడా ఎన్నోరకా
లున్నాయి. మీలో లేని ఫ్యాషన్లు మాలో
ఎన్నో వున్నాయి. కిర్రుచెప్పులు, తుర్రు
చెప్పులు, ఆకుజోళ్లు, ఇలా పలురకాలు. ఆ
తర్వాత మాలో ఎన్నోజాతులు. మీలోనే
కాదు వర్ణభేదా లుండడం; మాలో ఇంకా
ఎక్కువే. బూట్సులనీ, షూలనీ, స్లిప్పర్లనీ,
శాండల్సనీ - ఇలా ఏన్నోవిధాలు. మాలో
కూడా ఒక్కొక్కప్పుడు యుద్ధాలు జరుగు
తుంటాయి. దెబ్బలాటలో ఒకడు బూట్సు
విసరిన మరొకడు జోడు విసరును. ఒకడు
బూటు చేసిన వేరొకడు షూ చేయును. ఒకరి
నొకరు వెక్కిరించుకోవడం, తిట్టుకోవడం
కూడా కద్దు. దేశాలపై దాడివెడలి యుద్ధాలు
చేస్తుంటాము. గెలచినవారిదే రాజ్యం.
అందరూ వారి వేషభాషలే వాడుదురు.
ఒకప్పు డీదేశములో కిర్రుచెప్పులు వాడే
వారు. ఇప్పుడు చూడండి నానావిధాలు
వాడుతున్నారు. ఆకుచెప్పులు కిర్రుచెప్పుల
నోడించి రాజ్యం చేసినాయి. వాటిని గెల్చి
బెల్టుజోళ్లు వచ్చాయి. ఆతర్వాత బూట్లు,
కాబూలుజోళ్లు, బెంగాల్‌షూలు రాజ్యాధి
కారం వహిస్తున్నాయి. ఇంకా కాలాను
గతంగా ఎన్నిమార్పులు రాబోవునో? నాగ
రికత రోజూ మార్పు చెందుతూంటుంది.
పూర్వం మీస్త్రీలు నాజూకుగా రవికెలు
చీరలు ధరించుచుండిరి. ఇప్పుడు చూడండి,
జాకెట్లు, కురుచచేతుల బాడీలు, గౌనులు
వచ్చాయి. ఇంక కొంతకాలానికి బిత్తరులై
తిరుగుదురేమో? ఈ సూచనలు గూడా
గన్పడుతున్నాయి. అమెరికాలో న్యూడిజం
పేరట దిగంబరు లెందరో గలరు. మునుపు,
స్త్రీలు నిడుదపెన్నెరులు గలిగి ముచ్చటగా
కొప్పు పెట్టుచుండిరి. ఇప్పుడో-వెండ్రుకలు
కత్తిరించి, కురుచలుచేసి, క్రాపింగులు మొద
లెట్టినారు. ఇక కొన్నిరోజులకు వెండ్రుకలు
నున్నగా గొరిగింతురేమో! శుభంగా
కుంకుమ దాల్చడం ఫ్యాషన్ గాదట. పాడు
మొగాలతో తిరగడం చూస్తున్నాము మీ
మగవారిఫ్యాష న్లేమి చెప్పటము! పట్టంచు
పంచలు పోయి సూట్లు, హేట్లు వచ్చాయి.
ముద్దుగా ముడివేసికొనుచున్న వెండ్రుకలు
తీయించి, పలువిధాల క్రాపింగులు పెట్టు
చున్నారు. వీరి వింతవేషాలు చెప్పవచ్చిన
నానోరు నొచ్చును. మీలో ఇన్నిమార్పులు
గలుగుచున్నప్పుడు, మాలో గలిగెడి మార్పు
లకు కొదువా? వాటిని తలచిన నా
కెందుకో ఫక్కుమని నవ్వు వచ్చుచున్నది.
నన్ను చూచుకొన్న నాకే నవ్వు వచ్చును.
ఒరుల వైఖరి చూచిన నవ్వు రాకుండునా?
మీలో ఎందరో విమర్శకులు గలరు. నన్ను
విమర్శనచేసిన చేయవచ్చును. నన్ను పరిహ
సించిన నా కవమాన మేమీ లేదు. నే
నిప్పుడు ముసలిముండ నయ్యాను. మీరు
నవ్వితేమాత్రం, నాయవ్వనం తిరిగి వచ్చునా?
నా తెల్లవెండ్రుకలు నల్ల నగునా?

నేను పుట్టింది ధాతుసంవత్సర భాద్ర
పదమాసం బహుళాష్టమీ, ఆదివారంరోజున.
మరిచాను చెప్పడం మాది ఒక వింత పుట్టుక.
చావుతర్వాతనే, మాకు జననం. ఎక్కడే
జంతువు చచ్చునో యని కాచుకొనియుం

దుము. చావన్న మీ కెంతో దుఃఖం, మా కెంతో యానందం. ఏ మెద్దో, గేదో చచ్చినదో మాపుణ్యం పండునట్లు మెంతో ముద్దుగా అందంగా జన్మ మెత్తుదుము. మీ కిది చాలా విచిత్రంగా వుండునేమో! కాని దేవుడు మమ్ముల నట్లు పుట్టించినాడు.

నా స్వంతవూరు మాలపాడు. పేరుకు దగినట్లు మావూళ్లో ముప్పాతిక మువ్వీసం మాలలే. తదితరజాతులు తక్కువే. నేను పుట్టింది మాలపెద్ద చిన్నోడి గృహాన. నన్ను తయారుచేసింది నాతండ్రి మాలచిన్నోడే. మంచి దళసరిమైన తోలుతో తయారైనా. అప్పుడు మావూళ్లో వాడుకలో వున్న కిర్రు చెప్పుల రూపంతో వెలువడినా. జిగజిగలాడు గున్నా రేకులతోను, తళతళలాడు చిన్న అద్దపు ముక్కలతోను, ఆభరణసహితంగా అలంకరింపబడి ఎంతో ముద్దుగా మురువుగా మెరుస్తూన్నా.

ఆరోజు అమావాస్య. పగలు ౧౨ గంటలయింది. నన్ను కొనడానికి ఒక పెద్దమనిషి వచ్చాడు. మా నాన్నగారితో బేరమాడి ఒకరూపాయ, మూడణాల ఆరుపైసలకు నన్ను కొన్నాడు. అంతటితో నాకూ, నా పుట్టినింటికీ ఋణానుబంధం తెగిపోయింది. ఆతర్వాత మా యజమానితో వారి ఇంటికి వెళ్లిపోయాను. ఇల్లుమాత్రం పెద్ద మేడే. కానీ నన్నెప్పుడూ నడవనే, విడచిపోవడం చేత ఇంటినంతటిని చూచేభాగ్యం అబ్బింది గాదు. మొత్తానికి పెద్దింటివారి కోడలైనందుకు సంతోషించా. ఆతర్వాత మా వారితోగూడా ఎన్నోవూళ్లు చూచాను. కాశీయాత్రలు చేశాను. పెళ్లిళ్ల కేగినా. సినిమాలు చూచా. నాయదృష్టానికి ఎందరో నన్ను మెచ్చుకొన్నారు. నా సౌందర్యము అందరికీ భ్రమ గొల్పేది. ఎప్పుడే యాపద సంభవించునో యని నిత్యమూ భయపడే దాన్ని.

ఇలా కొంతకాలము గడచింది. నాకు కీడు మూడురోజులు దగ్గరికి వచ్చాయి. ఒక రోజు ఉళ్లక్కి ఉత్తారావుగారింట హరికథా కాలక్షేపం జరుగుతూంది. నేనుగూడా మా యజమానివెంట, హరికథాశ్రవణ కేగినా. వారు నన్ను ద్వారముదగ్గర వదలి లోని కెళ్లారు. హరికథదాసు అమాంతంగా బుర్ర త్రిప్పుతూ, వేశ్యకంటె అతివింతగా కులుకుతూ, నృత్యము చేస్తున్నాడు. తాను బొంగరములా, గిర్రుమని తిరుగుతూంటే తలపై పిలక తెయితెక్క లాడుతూంది. మద్దెల వాడు పళ్లు బిగించి దొమ్మరివాడి డోలు లాగు డం డం అంటూ చేతికొద్దీ బాదేస్తున్నాడు. ఈ ధమధమలలో, తాళధ్వనుల క్వణక్వణాలలో, దాసుగారి హరికథ ఏమాత్రమూ వినిపించడములేదు. భాగవతశిఖామణు లనబడువారు దాసుగారితోపాటు బుర్రలు త్రిప్పుతూ, ఆహా హూహూలతో అప్పుడప్పుడు ఓరచూపుల ప్రసరించి ప్రక్కనాసీనలై యున్న నారీమణుల చక్కదనాన్ని కన్నులపండువుగా ఆనందిస్తున్నారు. వీరందరిని చూచి ఒక పెద్ద నవ్వు నవ్వుకొన్నా. వారి వింతచేష్టల కెంతో అసహ్యమయింది. ఇలాంటి హరికథలవల్ల పుణ్యమా? పురుషార్థమా? ముక్తి నందము, విముక్తి యనలే చెందము. ఇలా వితర్కిస్తూ మా యజమాని త్వరలో నానందుకు విసుగుకొంటూ కాచుకొన్నా. సరి – ఇంతలో దాపురించాడు నా మృత్యుదేవత. చోరాగ్రేసర చక్ర

వర్తి. వీడిమొగం మండా. వీడికడుపు గాల్చా. వీ డావ్రాళ్లో పటంగి వెధవంట. చదువు లేదు సాము లేదు. పిచ్చయ్యగారి పెద్దకొడుకు, పేరు సోమయాజులు. నేతిబీర కాయలాంటి పేరు. చెప్పుల దొంగతనంలో అసమానకీర్తి గడించాడు. నా చెలికాండ్రెందరో వాసితలపై తన్నారు. కానీ వెధవకు సిగ్గొచ్చిందిగాదు. నాశాపాలు వీడి కొకడికే గాదు; ప్రతి చెప్పులదొంగకీ తగులును గాక! ఇంతకూ మా క్రయము ఒకరూపాయో, రెండురూపాయలో. ఈమాత్రానికి మమ్ముల దొంగిలింపవలెనా? దొంగిలించి ఎన్ని మేడలు గట్టగలరు? మాజాతివారికి రాజరిక మబ్బినపుడు న్యాయశాస్త్రాన్ని దిద్ది చట్టాన్ని మార్చి, ఈ చెప్పులదొంగలను కొరతవేయిస్తాము. అప్పుడు మాదెబ్బ చూతురుగాక! ఇప్పు డెందుకు చెప్పాలి?

సరికదా — సమయం కనిపెట్టి సోమయాజులు నాతో పలాయన మయ్యాడు. బయటకు తీయ భయపడి, ఒక నెలకాలము, వాడు తన ఇంటనున్న పాతబుట్టలో నన్ను దాచియుంచాడు. దానిలో తదితరవస్తువు లెన్నోవున్నాయి. చినిగిన గుడ్డపేలికలు, చిల్లులు పడిన టెంకాయచిప్పలు, త్రుప్పుపట్టిన మేకులు — ఇలాంటివి. నాతోడివారలకు, చుట్టపక్కాలకు దూరమైనా. నన్నెవరూ పలుకరించేవారు లేరు. నాకు జరిగిన పరాభవాని కెంతో చింతిల్లినా. నివురుగప్పిన నిప్పుచందమైంది నాగతి. ఇలాగే గాబోలు ఎన్నో విలువగల రత్నాలు సాగరజలముల నిమిడియుండును. ఎంతో పరిమళముగల ప్రసూనము లడవుల పాలగుట కద్దు. నాగతి ఇంతే ననుకొన్నా. ఇంతలో గోగుచుట్టుపై రోకటిపోటులాగు, రెండు చిట్టెలుకలు నన్నక్కడక్కడ తిని, వికృతాకారం చేసినాయి. పైగా చెదపట్టి మరింత వికారమైనా. అబ్బా! ఈ మొగ మెత్తి సరిసమానులలో నింకెలా దిరుగగలను? ఎంతో అవమానమయింది. నాగర్వం నశించింది. చావు మేలనుకొన్నా. యవ్వన మడుగంటింది. ఆ బుట్టలోనే ముసలిదాన్నయ్యా. నన్ను చూచి మెచ్చుకునేవా రెవరు? ఇలా విచారిస్తుండగా, ఒకరోజున ఆముష్టివెధవసోమయాజులు నన్ను శోధించి, నా కురూపానికి అసహ్యించుకొని, ఎడమచేతితో తీసి బయట పారవేశాడు. చూశారా! వీనిమూలాన నాకు గలిగిన ముప్పుతిప్పలు. నా యజమానికి నష్టం తన కుపయోగించకపోయినా. దెబ్బపై దెబ్బ తిని, నొప్పికి బాధపడుతూ, బయట నున్న మురుగుకాలవముందు పడ్డా. దేవుని కెప్పుడు కరుణ గలుగునో? ఎప్పు డాతని సాన్నిధ్యము చేరెదనో? నేను పనికిరాని వస్తువును గాను. దిక్కులేమిచే తల్లడిల్లుతూన్నా. ఒళ్లంతా గాయాలతో బాధపడుతూన్నా. మీ రెవరైనా నన్ను తీసికెళ్లి ఏ హాస్పిటల్‌లోనైనా చేర్చి మందు యిప్పించమని మిమ్ముల కోరుతా. మునైనా, మమ్ముల దొంగిలించక కష్టనష్టముల పాలు చేయవద్దని మిమ్ముల పదేపదే వేడుకుంటా. ఓ దయార్ద్రహృదయులారా! మీకు నమస్కారము, సెలవు."

ఆ వుపన్యాసం ముగియగానే నాకు మెలకువయింది. కళ్లు తెరచి చూచా. మా నల్లకుక్క, నాపాతజోడు నములుతూ నా కాళ్లదగ్గిర కూచుంది. నన్ను చూడగానే తోకాడిస్తూ నా దగ్గరకు వచ్చి, నా చేతులు నాకడం మొదలెట్టింది. ఉపన్యాసకర్త మాత్రం అగుపించలేదు.